# ఏం చేయాలి ?....

శ్రీ డి. మహీధర్ కుమార్

★

నాకు ముందుకు సాగిపోవడం సరదా. ముందుకు నడవడంలోనే మానవాభ్యుదయం కలుగుతుందనే నమ్మకంగలవాణ్ణి. అందుకే బయలుదేరాను. బయలుదేరబోయేముందు ఏంటో చాలా రకరకాలయిన భావాలొచ్చాయి. రకరకాలయిన ఆలోచనలతో నా మనస్సు కలవరపడింది. మానవుడు—పరిస్థితులు చక్కబెట్టుకోలేక భయపడుతుంటాడు. భయపడేవాణ్ణి నేను పిరికివాడంటాను. ఈ రోజు బయలుదేరబోయేముందు నాకూ భయమేసింది. అప్పుడప్పుడు మా చిట్టివాణ్ణి 'నువ్వేపనీ చేయలేవు, పిరికివాడవ'ని నిందించిన మాటలు నా స్మృతిపటలంమీద స్పష్టంగా కనుపించాయి. చిట్టివాడు మరల నన్ను పిరికివాడంటాడనే భావం నాలో జనించింది. ఇతరులు మనల్ని అంటారనేభావం కలగడంలో గూడా పిరికితనముందని నాకు తెలుసు. ఎంతో ధైర్య సాహసాలతో ఇలువీడి బయలుదేరాను. దారిలో మిట్ట పల్లాలు—ఎగుడు దిగుడు లుంటాయని నాకు తెలుసు. పైగా అలాంటి రాస్తాలో నడవడానికి కడు సమర్థత కావాలనీ తెలుసు. నాలో ఆ సమర్థత లేకపోయినప్పటికీ వుందని వూహించుకొని ఉత్సాహంతో బయలుదేరాను.

నీవెందుకు బయలుదేరుతున్నావని 'ఠకీ'మని ప్రశ్నిస్తారు. మంచి ప్రశ్నే వి[illegible]ాది! అయితే ఆగండి! సమాధానం చెబుతాను.

అవును! ముందు నా ఆకారం చూస్తే మీకు నవ్వేస్తుందిగదూ! చొక్కా బదాబదాలయింది. ధోతీ మురికి పట్టింది. శరీరం మలినంతో వుంది. కాని నా హృదయం నీలి ఆకాశంలాగా నిర్మలంగావుందని చెప్పడంలో నాకు నాకే సంతోషమేస్తూంది. అవును! మీరన్నట్లు నా శరీరం బక్కచిక్కి పోయింది. దీన్నిబట్టి నాకు కొద్ది రోజులనుండి ఆహారం లేదని వూహించగలుగుతారు. నా హృదయం విచారభారంతో కృంగి, కృశించిపోయిందని నే చెప్పకముందే మీరూహించారు.

అయినా లోకంలో విచారాన్ని మనసారా ప్రేమించి కన్నీటితో చెలిమిచేయాలనే అభిలాష అందరిలోనూ జనించదు.

చూచినవాళ్ళంతా నన్ను పిచ్చివాణ్ణిగా చూస్తారు. పిచ్చివాడని అనిపించుకోడానికి నా మనస్సు వూరుకోదు! నేను బాగా చదువుకున్నాననే సంగతి పిచ్చివాడనని భ్రమపడేవాళ్ళకు తెలీదు. నేనూ ఓ రోజు మీలాగే మానవుడు చేయవలసిన మంచి పనుల్నే చేశాను. ప్రపంచం నన్ను చూచి మురిసిపోవాలని ఉబలాటపడ్డాను.

నేనూ కొంత చేసి ప్రపంచానికి చూపెట్టా లనుకున్నాను. నా పేరు దేశ వ్యాపితం కావాలని కోరుకున్నా. నేనూ రచయితను కావాలనీ, నా రచనలు చదివినవాళ్ళంతా నన్ను ఎంతగానో ఆదరిస్తారనీ భ్రమపడ్డా.

ఎప్పుడో ఒకసారి నా జీవితంలో సుఖ వాతావరణాన్ని కల్పించుకోలేనా అనే భావం నా హృదయంలో అలజడి చేసింది. అందుకే అన్ని ప్రయత్నాలు చేశాను. నవ జీవనానికి మెట్టులు కడదామనుకున్నాను.

ప్రతి నిమిషమూ, ప్రతి ఘడియా ప్రపంచ పరిస్థితి పరికిస్తూంటే పరిపరి విధా లయిన ఆలోచనలతో నిండిపోతూంది హృదయం. హృదయంలో నిస్పృహ, నిరాశ నిస్పందతలతో నింపి కలవరాన్ని పుట్టిస్తున్నాయి. అయినా ముందుకు పోవా లనే ఆకాంక్ష అలాగే వుంది. అందుకే ముందుకు పోతున్నాను.

ఇంకా ముందుకు నడిచాను. చీకటి పడింది. ప్రపంచమంతా నల్లటి ఆకారంతో రేరాణి తన కురులు సవరించుకుంటూంది. దూరంగా మృగాల అరుపులు, కీచురాళ్ళ ధ్వనులు వినిపిస్తున్నాయి. వాటికే నా హృదయం నెమిలిలాగా నాట్యంచేస్తూంది.

అంతా నిశ్శబ్దం. ఒక్క పురుగూ మాట్లాడడంలేదు. అంతా అంధకార బంధురం. ప్రకృతంతా నీరవంతో నిద్రిస్తోంది. మానవ హృదయాల్లోగూడా నిశి తాండవ నృత్యం చేస్తూంది. నాకు నేనే మేల్కొన్నాననే భావం కలుగుతూంది. నిద్రాణమైన మానవజాతిని పరికిస్తున్నట్లు 'ఫీల్' అవుతున్నాను. కాని నేనొక్కణ్ణే మేల్కొన్నానని ప్రపంచానికి తెలీదు.

మానవజాతి అంతా నిద్రలో నిమగ్న మైవుంది. మేల్కొల్పాలనే ఆకాంక్ష జనించింది. నాలో ఆశక్తివుందని నాకు తెలుసు. నిద్రావస్థలోవున్న ప్రపంచానికి ఒక దివ్య సందేశం ఇవ్వగల ఒక మహత్తరశక్తి నాలో ఇమిడివుందని వూహించాను.

ఇంకా ముందుకు సాగిపోయాను. ఏదో శక్తి నన్నింకా ముందుకు నడవమంటూంది. దారి కన్పించడంలేదు. అంతటా అంధకారం అల్లుకుపోయింది. వెలుగు ఎప్పుడు వస్తుంది?

అంధకారం అంతటా అలాగే వుంది. కన్ను పొడుచుకున్నా కనపడడంలేదు. నా హృదయం మాటిమాటికి 'ఏంచెయ్యాలి'! అని ప్రశ్నిస్తూనే వుంది. ఏంచెయ్యాలి!

కథాంజలి

విడిప్రతి 0-3-0

సంవత్సర చందా 3-4-0

(ప్రత్యేక సంచికలతోసహా)